ప్రజాశక్తి
సోమవారం 18 డిసెంబర్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

జంబ్లింగ్ అయోమయం

పలు నియోజకవర్గాల్లో టిక్కెట్లపై వైసిపి శ్రేణులు, నాయకుల గరంగరం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



వైసిపిలో జంబ్లింగ్ విధానం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్పు చేసి పలు నియోజకవర్గాల్లో కొత్త వారిని రంగంలోకి తేవాలనే వైసిపి అధిష్టానం ప్రయత్నంపై భిన్న స్వరాలు విన్పిస్తున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత నిరోధించడానికి జంబ్లింగ్ విధానాన్ని ఆ పార్టీ ఎంచుకుంది. ఈ విధానం వల్ల ఎంత లాభమో అంతే నష్టం కూడా ఉంటుందని వైసిపి సీనియర్‌లు అభిప్రాయపడుతున్నారు. ఒకచోట చెల్లని కాసు మరోచోట చెల్లుతుందా? అని టిడిపి నాయకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఓటమి భయంతోనే ఒకచోట నుంచి మరొక చోటికి వెళ్తున్నారని కూడా టిడిపి విమర్శలు గుప్పిస్తోంది.

మరోవైపు టిక్కెట్ రాని వారు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన పదవికి, వైసిపికి రాజీనామా చేసి హైదరాబాద్ వెళ్లిపోయారు. కొద్దిరోజులు జిల్లా రాజకీయాలకు దూరంగా ఉండాలని ఆయన నిర్ణయించుకున్నారని అనుచరులు చెబుతున్నారు. మంగళగిరి వైసిపి ఇన్‌ఛార్జిగా గంజి చిరంజీవిని ప్రకటించడంతో ఆర్‌కె గ్రూపు అంతా మౌనంగా ఉన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా నియమితులైన మంత్రి విడదల రజిని స్థానికంగా వైసిపి సీనియర్ నాయకులను కలిసి వారి సహకారాన్ని కోరుతున్నారు. స్థానిక అధికార యంత్రాంగంతో మంత్రాంగం చేస్తున్నారు. ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌కు ఇంకా ప్రత్యామ్నాయం చూపలేదు. ఆయన అనుచరులు అయోమయంలో ఉన్నారు.

పొన్నూరులో ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు ఈసారి అవకాశం లేదని పార్టీ అధినేత తరుపున కొంతమంది అగ్రనాయకులు చెప్పినట్టు తెలిసింది. కొంతకాలంగా రోశయ్య నియోజకవర్గంతో అంటీముట్టన్నట్టు ఉంటున్నారు. ఆయన స్థానంలో ఇంత వరకు సరైన అభ్యర్థిని ఎంపిక చేయలేదు. సత్తెనపల్లి ప్రాంతంలో అనేక వివాదాలలో ఉన్న వ్యక్తిని పొన్నూరు అభ్యర్థిగా ఎంపిక చేస్తే వైసిపి గెలుపు కంటే టిడిపికి మేలు చేసినట్టు అవుతుందనే వాదన ఆ పార్టీ సీనియర్‌ల నుంచి వినిపిస్తోంది.

ఎంపి అయోధ్యరామిరెడ్డి కుటుంబంలో మంగళగిరి నుంచి ఆర్‌కెకు అవకాశం ఇవ్వకపోవడం వల్ల మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డికి పల్నాడులో ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలని సిఎం జగన్ నిర్ణయించారని ప్రచారం 2లో



దున్నపోతుకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

రాజధాని అమరావతి కోసం ప్రత్యక్ష పోరాటం

సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరరావు

3లో

పగలగొట్టడాలు.. ప్రతిఘటనలు..

- అంగన్వాడీ కేంద్రాలను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు
- తాళాలను తీయనీయకుండా అడ్డుకుంటున్న అంగన్వాడీలు, సిపిఎం నాయకులు
- ఉండవల్లిలో పలువురు అరెస్టు - నిలువరించే క్రమంలో పలువురికి గాయాలు



మంగళగిరిలోని అన్నపూర్ణ థియేటర్ సమీపంలో అంగన్వాడీ కేంద్రం తాళాలు పగలగొట్టకుండా అడ్డుకుంటున్న సిపిఎం నాయకులు, స్థానికులు, అంగన్వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా విలేకర్లు

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు సమ్మె చేస్తున్న నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగలగొడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జిల్లాలోని 2లో

ఉండవల్లి కేంద్రం వద్ద అరెస్టులు

తాడేపల్లి పట్టణ శివారులోని శివదుర్గాపురం అంగన్‌వాడీ కేంద్రం తాళాలను రెవెన్యూ అధికారులు పగులగొట్టేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలిసిన అంగన్‌వాడీలు, స్థానిక ప్రజలు సాయంత్రం వరకూ అంగన్‌వాడీ కేంద్రం వద్దే ఉన్నారు. సాయంత్రం 6.30 గంటలకు వారంతా వెళ్లిపోవడంతో సచివాలయ సిబ్బంది వచ్చి తాళాలు పగులగొట్టారు. అక్కడ నుంచి సిఎం నివాసానికి సమీపంలోని ఉండవల్లి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లారు. అప్పటికే అక్కడికి సిపిఎం, టిడిపి నాయకులు, అంగన్‌వాడీలు చేరుకోవడంతో వెనుదిరిగారు. అధికారులు అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోనే మాటువేసి ఉండడంతో నాయకులు, కార్యకర్తలు, జనం కూడా అక్కడే ఉండి తాళాలు పగులగొట్టకుండా చూశారు. 10 గంటలకు పోలీసులు రంగ ప్రవేశం చేసి నాయకులను తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీన్ని నాయకులు ప్రతిఘటించే క్రమంలో ఉద్రిక్తత, తోపులాట తలెత్తి పలువురికి గాయాలయ్యాయి. స్టేషన్‌కు తరలించబడిన వారిలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.భాస్కరయ్య, రాజధాని డివిజన్ నాయకులు వి.వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు పి.జ్యోతిబసు, జి.బసివిరెడ్డి, కె.రమేష్, జనసేన నాయకులు ఎస్.నాగేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారు.



ఉండవల్లిలో అరెస్టు చేస్తున్న పోలీసులు



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు

పర్సా సత్యనారాయణ జీవితం ఆదర్శనీయం

శతజయంతి సందర్భంగా సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

గని కార్మికుడిగా, సిఐటియు ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులుగా, ఎమ్మెల్యేగా పనిచేసి కార్మిక వర్గం ఐక్యత కోసం తుది శ్వాస విడిచే వరకూ పనిచేసిన పర్సా సత్యనారాయణ నేటి తరానికి ఆదర్శమని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు అన్నారు. పర్సా సత్యనారాయణ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు-ఉద్యోగులు, కార్మికులపై ప్రభావం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. తొలుత యుటిఎఫ్ సీనియర్ నాయకులు విశ్వనాథం, సిఐటియు నాయకులు హుస్సేన్‌వలి పర్సా సత్యనారాయణ, పిడిఎఫ్ ఎమ్మెల్సీ సాబ్జి చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీణారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ సింగరేణి గనిలో సత్యనారాయణ ఉద్యోగిగా చేరి, కార్మికుల ఐక్యత కోసం కృషి చేశారని, ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి మొత్తం కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి పాటు పడ్డారని చెప్పారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం జరిగిన ఉద్యమంలో తన 2లో



4లో

పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో అంగన్వాడీలకు సంఘీభావంగా సమ్మె శిబిరంలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న లబ్ధిదారు్లు

సమ్మె శిబిరాల్లో లబ్ధిదార్లు, పిల్లలు



సమ్మెకు మద్దతుగా గుంటూరు జిల్లా మంగళగి శిబిరం వద్ద మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.ఆంజనేయ నాయక్

అర్థాకలితో 104 ఉద్యోగుల కుటుంబాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నెలల తరబడి జీతాలు పెడింగ్‌లో పెట్టడం వల్ల 104 వాహన ఉద్యోగుల కుటుంబాలు అర్థాకలితో అలమటిస్తున్నాయని ఏపి 104 ఎంఎంయు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.కృష్ణారెడ్డి, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ అన్నారు. యూనియన్ జిల్లా సమావేశం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని కోటప్పకొండ రోడ్డులో ఉన్న పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ఎం.కృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా ఆంజనేయనాయక్ మాట్లాడుతూ 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వాహన సేవలను గతంలో మాదిరి రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. జీఓ 4459 ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ సరిగా అమలు చేయాలన్నారు. యాజమాన్యం చెల్లించాల్సిన ఎంప్లాయర్ కాంట్రిబ్యూషన్‌ను అరబిందో యాజమాన్యం ఇవ్వాలని కోరారు. 104లో పనిచేస్తున్న డిఇఒలకు వెయిటేజ్ మార్కులు 2లో



'ఉక్కు సత్యాగ్రహం' ప్రచార బస్సు ప్రదర్శన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తెలుగు సేన ఆధ్వర్యంలో నిర్మించిన ఉక్కు సత్యాగ్రహం సినిమా ప్రచారం కోసం బస్సు యాత్ర పట్టణంలోని జయలక్ష్మి పిక్చర్ ప్యాలెస్ సినిమా హాల్ వద్ద ఆదివారం నిర్వహించారు. సినిమా సభ్యులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణకు వ్యతిరేక ఉద్యమంలో భాగంగానే ఈ సినిమాను నిర్మించామన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ నటించిన ఆఖరి చిత్రం ఈ ఉక్కు సత్యాగ్రహం అని చెప్పారు. ఎంతోమంది ఆంధ్రులు ప్రాణాలర్పించి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించకుండా సాగే ఉద్యమంలో భాగంగా ఈ సినిమా నిర్మాత, హీరో, దర్శకుడు సత్యారెడ్డి ఈ సినిమాను నిర్మించారని వివరించారు. ఈ సినిమాను ప్రతి ఒక్కరూ చూడాలని కోరారు. పల్నాడు ప్రాంతంలోని అన్ని మండల కేంద్రాల్లో బస్సు యాత్ర ఉంటుందన్నారు.



కృష్ణ చిత్ర పటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న అభిమానులు

సమాజాన్ని ప్రభావితం చేసిన కృష్ణ చిత్రాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సూపర్‌స్టార్ కృష్ణ అభిమానుల ఆత్మీయ సమావేశం స్థానిక ప్రకాష్ నగర్‌లోని కృష్ణ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగింది. 1980 మొదలు 2000 సంవత్సరం వరకు ఉన్న కృష్ణ అభిమానులతో నిర్వహించిన సమావేశానికి టౌన్‌వైడ్ సూపర్ స్టార్ కృష్ణ - మహేష్‌బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు ఎమ్‌డి.ఫారూఖ్‌బాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. నాడు ఎన్టీఆర్, ఎఎన్‌ఆర్‌తో పాటుగా ప్రజాధరణ ఉన్న కథానాయకుడు కృష్ణ అని కొనియాడారు. 350కు పైగా చిత్రాల్లో నటించారని, ఆయన ప్రతి చిత్ర కుటుంబాలను, సమాజాన్ని ప్రభావితం చేశాయడంతో పాటు ప్రజలలో ప్రశ్నించే తత్వం, నాయకత్వ లక్షణాలు కల్పించాయని చెప్పారు. ఈ సందర్భంగా కృష్ణ నటించిన పలు సినిమాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం కృష్ణ విగ్రహ ఏర్పాటుపై చర్చించారు. తొలుత కృష్ణ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కె.శేషుకుమార్, పద్మాలయ వేణు, కె.విశ్వేశ్వరరావు, బి.కొండలరావు, దేశిరెడ్డి మాల్లారెడ్డి, షేక్.నాగుర్‌వలి, కరిముల్లా 157, పత్తికొండ వెంకటరావు, షేక్.నబిబాజీ, షేక్.ఫరీద్, డి.రాజా, అన్నపురెడ్డి తిరుపతయ్య, పి.శంకర్, థామస్ పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం : సిఐ

ప్రజాశక్తి - మాచర్ల

విద్య ద్వారానే ఎస్సీ, ఎస్టీల సామాజిక స్థితిగతులు మారుతాయని, వివక్షకు దూరమవుతారని పట్టణ సిఐ శరత్‌కుమార్ అన్నారు. స్థానిక వివేకానంద సేవా సమితి కార్యాలయంలో గురజాల డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం కమిటీ అధ్యక్షులు పొలేష్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సిఐ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్ష ఇప్పటికీ కొనసాగుతోందని, దాన్ని ఎదుర్కొనేందుకు ఐకమత్యంగా ముందుకు సాగాలని చెప్పారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ ముక్కంటి, ఎఎస్‌డబ్ల్యూఒ సుజాత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టణ సిఐ శరత్‌కుమార్

మహిళల హక్కులే మానవ హక్కులుగా ఉండాలి : ఐద్వా

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మహిళల హక్కులే మానవ హక్కులుగా ఉండాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు డి.శ్రీనివాసకుమారి అన్నారు. స్థానిక పుతుంబాక భవన్‌లో ఐద్వా జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్‌బి అధ్యక్షతన విస్తృత సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసకుమారి మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు, నిరుపేద కుటుంబాల మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని, వారికి ప్రభుత్వ పౌష్టికాహారం అందించాలని కోరారు. రేషన్ షాపుల ద్వారా కందిపప్పు సహా తొమ్మిది రకాల నిత్యవసర వస్తువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వినుకొండలో వృద్ధురాలిపై అత్యాచారం ఘటనలో దోషులను సత్వరమే కఠినంగా శిక్షించాలని, జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆమెకు రూ.6 లక్షల తక్షణ సాయం అందించాలని, ఇల్లు మంజూరు చేయాలని, పెన్షన్ ఇవ్వాలని కోరారు. దిశ ఒన్‌స్టాప్ నిర్వహణకు తక్షణం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న డి.శ్రీనివాసకుమారి

సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి జి.రజిని, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎం.జ్యోతి, జి.ఉమశ్రీ, నాయకులు అనూష, సుజాత, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ పాల్గొన్నారు.

జంబ్లింగ్ అయోమయం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతోంది. మంత్రి అంబటి రాంబాబును వేరే నియోజకవర్గానికి పంపితే సత్తెనపల్లిలో మోదుగులకు అవకాశం కల్పిస్తారని చెబుతున్నారు. గురజాల నుంచి తానే పోటీ చేస్తానని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ప్రకటించారు. గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని నర్సరావుపేటకు పంపి మోదుగులకు గురజాల ఇవ్వనున్నారు. నర్సరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డిని సత్తెనపల్లికి మారుస్తారనే ప్రచారం కూడా ఉంది. మొత్తంగా పల్నాడులో మూడు నియోజకవర్గాలకు అభ్యర్థుల మార్పు ఖాయంగా ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి. చిలకలూరిపేటలో ఇప్పటికే మంత్రి రజినీని మార్పు చేసి మల్లెల రాజేష్‌కు అవకాశం కల్పించడంపై కొన్ని తరగతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. నూరుబాషాలకు ఇక్కడ అవకాశం ఇస్తారని ప్రచారమైంది. దీంతో నూరుబాషాలను టిడిపి నాయకులు తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 8 నియోజకవర్గాల్లో జంబ్లింగ్ విధానం పాటించగా మరో ఐదు నియోజకవర్గాల్లో ఈ మార్పు తప్పదని తెలుస్తోంది.

పర్సా సత్యనారాయణ జీవితం ఆదర్శనీయం

(మొదటి పేజీ తరువాయి)

పదవికి రాజీనామా చేసి నిరసన తెలిపారన్నారు. చివరి వరకూ ఆడంబరాలేమీ లేని జీవితం గడిపారన్నారు.

ప్రభుత్వాల విధానాలపై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను సైతం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని, బీమా, బ్యాంకులు, గనులు, రైల్వేలు, రక్షణ రంగం సహా కట్టబెడుతోందని విమర్శించారు. విశాఖ ఉక్కును అమ్మటానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఎపిలో ఉన్న కెజి బేసిన్ గ్యాస్‌ను గుజరాత్‌కు తరలిస్తూ ఇక్కడి ప్రజలకు గ్యాస్ సబ్సిడీ రద్దు చేశారన్నారు. విద్యుత్ సంస్కరణల పేరుతో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయబోతున్నారని, వాటికయ్యే ఖర్చును కూడా వినియోగదారుల నుండే వసూలు చేస్తారని హెచ్చరించారు. మోడీ పాలనలో గ్యాస్, పెట్రోలు, విద్యుత్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని, కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని క్రమబద్ధీకరిస్తామని కేవలం 10వేల మందినే చేస్తున్నారని తెలిపారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదన్నారు. అంగన్‌వాడీలు, ఆశాలు, విఆర్‌ఎలు పలు స్కీమ్ వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో 50 లక్షల మంది షెడ్యూలు పరిశ్రమల కార్మికులు ఏళ్ల తరబడి వేతన సవరణకు నోచక, చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు.

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఉద్యోగులు, కార్మికులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయన్నారు. లేబర్ కోడ్‌లు తెచ్చాక 8 గంటల పనివిధానం అమలు కావట్లేదన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న వేధింపులను అరికట్టటంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని విమర్శించారు. అంతర్గత కమిటీలు వేయాలన్ని నిబంధనలు ఎక్కడా అమలు కావట్లేదని, మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు అవసరం లేదని బిజెపి నాయకురాలు స్మృతి ఇరాని ప్రకటించటం అన్యాయమని మండిపడ్డారు. ఎల్ఐసి ఉద్యోగుల సంఘం మచిలీపట్నం డివిజన్ జాయింట్ సెక్రెటరీ వి.వి.కె.సురేష్ మాట్లాడుతూ దేశ ప్రజలు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారని, నేషనల్ శాంపిల్ సర్వే, మానవాభివృద్ధి నివేదిక, ఆక్స్‌ఫామ్ వంటి రకరాల నివేదికల ప్రకారం సామాజికంగా, ఆర్థికంగా భారతదేశం వెనుకబడి ఉన్నట్లు చెప్పాయని వివరించారు. ఈ వెనుకబాటుకు కారణమైన పాలకుల విధానాలను కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. ఎన్‌జిఒ అసోసియేషన్ నగర నాయకులు మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల్ని, ఉద్యోగుల్ని వేరు చేయటానికి, ఉద్యోగులపై దుష్ప్రచారం చేస్తోందని, ఉద్యోగులు, కార్మికులు, ఇతర సామాన్య ప్రజలు ఐక్యంగా ఉండాలని కోరారు. సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, నాయకులు ఎన్.శివాజీ, కె.శ్రీనివాసరావు, ఎం.భాగ్యరాజు, రమేష్, బి.ముత్యాలరావు, బి.లక్ష్మణరావు, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.అనురాధ పాల్గొన్నారు.

అర్ధాకలితో 104 ఉద్యోగుల కుటుంబాలు

(మొదటి పేజీ తరువాయి)

కల్పించి ప్రభుత్వ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. అక్రమ బదిలీలు, తొలగింపులకు గురైన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఎం.కృష్ణారెడ్డి మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో 104 ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సిఎం హామీ ప్రకారం 104 ఉద్యోగులను ఆప్కాస్‌లో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించి మెరుగైన జీతాలివ్వాలని కోరారు. 104 వాహనాలను నిర్వహిస్తున్న సంస్థ అరబిందో యాజమాన్యం ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా 3 నుండి 4 నెలల పాటు పెండింగ్‌లో ఉంచుతోందని, ఇలాగైతే ఉద్యోగుల కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి నెలనెలా జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. 104 వ్యవస్థను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా యూనియన్ నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా పి.కోటేశ్వరరావు, సిహెచ్ కృష్ణావాసు, గౌరవాధ్యక్షులుగా ఎస్.ఆంజనేయ నాయక్, కోశాధికారిగా సిహెచ్ అశోక్, ఉపాధ్యక్షులుగా షేక్ సుభాని, షేక్ బాషా, సహాయ కార్యదర్శిగా వెంకట నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.కోటిరెడ్డి, సభ్యులుగా శివ సుధాకర్, ఎం.ప్రభాకర్, ఎం.మల్లికార్జునరావు, బాలకిరణ్, ప్రతాప్, ఎస్.ఐజాక్, రవితేజ, ఝాన్సీ ఎన్నికయ్యారు.

పగలగొట్టడాలు.. ప్రతిఘటనలు..

(మొదటి పేజీ తరువాయి)

పలు ప్రాంతాల్లో కేంద్రాల వద్దకు వెళ్లిన అధికారులను సిఐటియు, సిపిఎం నాయకులు అడ్డుకున్నారు. మరికొన్ని చోట్ల అధికారుల చర్యలను ఖండిస్తూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. మంగళగిరి పట్టణంలో 8 సెంటర్లో ఆదివారం సాయంత్రం అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడానికి వీఆర్వో, సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడి సూపర్వైజర్ ఆధ్వర్యంలో ప్రయత్నించారు. కొన్ని సెంటర్లో తాళాలు పగలగొట్టి అందులోని రికార్డులను, సరుకులను స్వాధీనం చేసుకున్నారు. అన్నపూర్ణ థియేటర్ సమీపంలోని అంగన్వాడి కేంద్రం వద్ద తాళాలు పగలగొట్టడాన్ని అంగన్వాడీలు, సిపిఎం నాయకులు అడ్డుకుని రెండు గంటలపాటు నిలువరించారు. పట్టణ ఎస్ఐ బి.మహేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి సచివాలయ ఉద్యోగులు తీసుకొచ్చిన తాళాలను వేయించడానికి ప్రయత్నించారు. అయితే అక్కడే ఉన్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, నాయకులు ఎం.బాలాజీ, ఆ ప్రాంత ప్రజలు, అంగన్వాడీ టీచర్, ఆయాలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఉద్రిక్తత తలెత్తింది. చాలా సేపటి తర్వాత సచివాలయ ఉద్యోగులు, వీఆర్వో వెనుదిరిగి వెళ్లారు. ఇదిలా ఉండగా ఈ కేంద్రం అద్దె భవనంలో నిర్వహిస్తుండగా ఇంటి యజమాని కలుగజేసుకుని ఎంత మంది వచ్చి తాళం వేస్తారని ప్రశ్నించారు. తలుపులకు ఏమైనా అయితే ఎవరు బాగుచేయిస్తారని అన్నారు. ఆత్మకూరులో అంగన్వాడి కేంద్రాల వద్దకు వచ్చి తాళాలు పగలగొడుతున్న సమయంలో స్థానిక నాయకులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు ఎం.పకీరయ్య, జాన్‌బాబు, లవకుమార్, దుర్గారావు, మరియదాసు, పద్మనాభశర్మ, సుకుమార్, కృష్ణ, బాపనయ్య, అజయ్ కుమార్, కోటయ్య, సీతారామాంజనేయులు పాల్గొన్నారు. తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం, కొలనుకొండ, ఇప్పటం, రాధా రంగా నగర్, తదితర గ్రామాల్లోని కేంద్రాల తాళాలను పగలగొట్టేందుకు అధికారులు పూనుకున్నారు. వడ్డేశ్వర సెక్టార్ పరిధిలోని ఆరు గ్రామాలలో కేంద్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సెక్టార్ సూపర్వైజర్ శిరమణి తెలిపారు. ఈ చర్యలను ఖండిస్తూ అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. యూనియన్ గౌరవాధ్యక్షులు వి.దుర్గారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. సచివాలయం సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. ఈనెల 21 నుంచి మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిసిందని, అప్పుడు వారి పని కూడా సచివాలయం సిబ్బందితో చేయిస్తారా? అని ప్రశ్నించారు. ఉద్యోగుల మధ్య ప్రభుత్వం చిచ్చుపెడుతోందని, ఈ కుట్రను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నిరసనలో ఎఐటియుసి నాయకులు టి.వెంటయ్య, సరళ, తబితా, కిరణ్మయి, మాణిక్యం, శ్రీదేవి, భవాని, సుజాత, లక్ష్మి, శోభా, వరలక్ష్మి, ఫాతిమా, మాధురి పాల్గొన్నారు. పెదకాకాని మండలంలోని గొల్లమూడి, వెనిగండ్ల, పెదకాకానిలోని కేంద్రాల తాళాలలను పగలగొట్టేదుకు అధికారులు సిద్ధమవగా ఇది తెలిసిన సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ, నాయకులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు. తాడికొండ మండలంలోని 69 కేంద్రాల తాళాలను అధికారులు పగలగొట్టించారు.



చిరస్మరణీయులు మామిడి భద్రయ్య

వర్ధంతి సభలో సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, అనంత పిచ్చయ్య


సభలో మాట్లాడుతున్న గద్దె చలమయ్య, వేదికపైన జి.విజయకుమార్ తదితరులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

చేనేత రంగ సమస్యలపై కడదాక పోరాటం చేసిన మామిడి భద్రయ్య చిరస్మరణీయులని సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, అనంత పిచ్చయ్య అన్నారు. సత్తెనపల్లి కొత్తపేటకు చెందిన సిపిఎం సీనియర్ నాయకులు మామిడి భద్రయ్య 25వ వర్ధంతి సభ స్థానిక కొత్తపేటలోని భావన రుషి నగర్‌లో ఆదివారం జరిగింది. సభకు సిపిఎం పట్టణ కార్య దర్శి డి.విమల అధ్యక్షత వహించారు. పిచ్చయ్య, చలమయ్య మాట్లాడుతూ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ కాలంనాటి నుండి మామిడి భద్రయ్య చేనేత రంగ సమస్యలపై పోరాటం చేశారని, చేనేత కార్మికులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దారని చెప్పారు. ఆ ఫలితంగానే కొత్తపేటలోని మూడు వార్డుల పరిధిలో ఉద్యమాన్ని నిర్మించారన్నారు. ఆ వార్డుల నుండి గతంలో సిపిఎం అభ్యర్థులు కౌన్సిలర్లుగా ఎన్నికై కౌన్సిల్‌లో ప్రజావాణిని వినిపించారని గుర్తు చేశారు. 1964లో పార్టీ చీలినప్పుడు మామిడి భద్రయ్య ఆయనతో పాటు ఆయన సోదరుడు మామిడి వెంకటరామయ్య, ఆ కుటుంబాలన్నీ సిపిఎం వైపు నిలిచారని అన్నారు. వారి స్ఫూర్తితోనే వారి కుమారులు, కుమార్తెలు కూడా ప్రజాఉద్యమాల్లో నిలబడ్డారని చెప్పారు. సభలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతు మామిడి భద్రయ్య చేసిన కృషిని కొని యాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ముందుగా భద్రయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎ లక్ష్మేశ్వరరెడ్డి, ఏపూరి గోపాలరావు, వై రాధాకృష్ణ, ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, నాయకులు జి.మల్లేశ్వరి, డి.శ్రీనివాస్ కుమారి, ఎ.వీరబ్రహ్మం, ఎం.జగన్నాథరావు, జి.ఉమశ్రీ, ఆర్.పురుషోత్తం, ఎం.హరిపోతురాజు, షేక్ సైదులు, మస్తాన్‌వలి, కె.శివదుర్గారావు పాల్గొన్నారు. అనంతరం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో నిర్మితమవుతున్న పల్నాడు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి భద్రయ్య కుమారుడు డాక్టర్ మామిడి ఆదినారాయణ కుటుంబం రూ.లక్షను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పోరాట కాలం నుండి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలోనూ అనంతరం, సిపిఎంలో కొనసాగుతున్న అనంత పిచ్చయ్య, గుంటూరు విజయ్ కుమార్ తండ్రి గుంటూరు వేమయ్యను సన్మానించారు.


భద్రయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


గుంటూరు వేమయ్య, అనంత పిచ్చయ్యకు సన్మానం, విజ్ఞాన కేంద్రానికి విరాళం అందజేస్తున్న భద్రయ్య కుటుంబ సభ్యులు

రాజధాని అమరావతి కోసం ప్రత్యక్ష పోరాటం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరరావు

దున్నపోతుకు వినతి పత్రం ఇచ్చిన రాజధాని రైతులు

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని అమరావతి సాధన కోసం, రైతుల కౌలు సొమ్ము కోసం ప్రత్యక్ష పోరాటానికి సన్నద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటన చేసి ఆదివారంతో నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తుళ్లూరు రైతు దీక్షా శిబిరంలో నిర్వహించిన సభలో ముప్పాళ్ల ప్రసంగించారు. ఎలాంటి ఆదాయ మార్గాలు లేని రైతులకు కౌలు చెల్లించక పోవడం సిగ్గు చేటన్నారు. అమరావతి సామాజిక ఫించన్ ను రూ 5 వేలకు పెంచుతామని చెప్పిన ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. సమస్య పరిష్కారం కావాలంటే పోరాటంలోని రావాలన్నారు. ప్రతిపక్షంలో ఉండి చంద్రబాబు కన్నా అమరావతిని ఎక్కువ అభివద్ధి చేస్తానని నమ్మబలిక అధికారం లోకి వచ్చాక జగన్‌మోహన్‌రెడ్డి మడమ తిప్పారని అన్నారు. అమరావతి బహుజన పరిరక్షణ సమితి అధ్యక్షుడు పోతుల బాల కోటయ్య మాట్లాడుతూ అంగన్వాడీ ల సమస్యల పరిష్కారం కోసం కషి చేయకుండా రాజధానిలో ఇసుక, కంకర, ఇనుము దొంగిలించినట్లు అంగన్వాడి కేంద్రాల్లో తాళాలు పగుల గొట్టి గుడ్లు ఎత్తుకు పోతున్నారని ఎద్దేవా చేశారు. అమరావతి నుంచి పోటీచేసే ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులకు లక్ష ఓట్ల మెజార్టీ రావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజక వర్గ ఇంచార్జీ చిలకా విజయ్ కుమార్ మాట్లాడుతూ త్వరలో అమరావతికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వస్తారని, అమరావతికి కాంగ్రెస్ అండగా ఉంటుందని చెప్పారు. దళిత బహుజన జెఎసి కన్వీనర్ చిలకా బసవయ్య మాట్లాడుతూ, అసైన్డ్ రైతులకు మూడేళ్లుగా కౌలు చెల్లించడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో ధనేకుల రామారావు,బెల్లంకొండ నరసింహారావు,పువ్వాడ సుధాకర రావు,రాయపాటి శైలజ,న్యాయవాది రజనీ తదితరులు ప్రసంగించారు.

దున్నపోతుకు వినతిపత్రం : రాజధాని రైతులు వినూత్నంగా దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చారు. ముఖ్యమంత్రిని దున్నపోతుగా అభివర్ణిస్తూ వినతిపత్రాన్ని మెడకు కట్టారు. అసెంబ్లీలో జగన్ మోహన్ రెడ్డి మూడు రాజధానుల ప్రకటన చేసి ఆదివారంతో నాలుగేళు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వానికి ఎన్ని విన్నపాలు చేసినా దున్నపోతు మీద చినుకులు పడిన చందంగా ఉందంటూ నిరసన వ్యక్తం చేశారు. దున్నపోతు మీద జగన్ చిత్రపటాన్ని ఉంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.


తుళ్లూరు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు



గుంటూరులో నిరసన

యువత భవిష్యత్తు నాశనం చేసిన జగన్

గుంటూరులో రాజధాని రైతుల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని మార్పు పేరుతో యువత భవిష్యత్తును సిఎం జగన్ సర్వనాశనం చేశారని అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షులు పువ్వాడ సుధాకర్ ఆరోపించారు. అమరావతి పరిరక్షణ ఉద్యమానికి నాలుగేళ్లు పూర్తైన సందర్భంగా లాడ్జి సెంటర్‌లో అమరావతి పరిరక్షణ సమితి, నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రైతులు, మహిళలకు మద్దతుగా నిరసన కార్యక్రమం జరిగింది. సుధాకర్ బాబు మాట్లాడుతూ ఈ నాలుగు సంవత్సరాల కాలంలో ఈ రాష్ట్ర ప్రజల్ని అనేక రకాలుగా ఇబ్బందులు గురిచేస్తూ తల తోక లేనటువంటి ఆలోచన విధానంతో ప్రజల్ని భ్రష్టు పట్టిస్తూ మన బిడ్డల యొక్క బంగారు భవిష్యత్తుని నాశనం చేశారన్నారు. సిఎం జగన్ గత నాలుగున్నర ఏళ్ల సమయాన్ని రాష్ట్ర ప్రజలకు మేలు చేయడానికి తప్ప కీడు చేయడానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. ఒకవైపు రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన అమరావతి రాజధానిని ధ్వంసం చేశారని మరొకవైపు ఈ రాష్ట్ర రైతాంగానికి ప్రయోజనం చేకూర్చేటువంటి పోలవరం నిర్మాణాన్ని ఆపేశారన్నారు. ఈ రాష్ట్ర ప్రజల హక్కు అయినటువంటి విశాఖ ఉక్కుని ప్రైవేటుపరం చేస్తుంటే మౌనం వహించావన్నారు. అంటే ఈ రాష్ట్ర ప్రజల అభివృద్ధికి తోడ్పడే ప్రతి పనిని అడ్డుకుని మోసం చేశారని తెలిపారు. పరిరక్షణ సమితి జెఎసి నాయకురాలు రాయపాటి శైలజ మాట్లాడుతూ ఒక ప్రాంతం మీద ఒక కులం మీద ఆ విద్వేషాన్ని అంతా అమరావతి మీద చూపిస్తూ రాజధాని మీద కక్ష కట్టి నాలుగేళ్లయిందన్నారు. మూడు మూడు రాజధానుల నినాదంతో రాష్ట్రం మొత్తం విద్వేషాలు రగిలించారని అన్నారు. విశాఖకు పరిపాలన రాజధాని అంటూ నాలుగేళ్లుగా ఎన్నో ముహూర్తాలు పెట్టి జగన్ ఘోరంగా విఫలం అయ్యారని అన్నారు. నాలుగు సంవత్సరాలు రైతులు, అలాగే రాష్ట్ర ప్రజలు చేస్తున్న ఉద్యమం వల్ల జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి నుంచి వైజాగ్ లో అడుగుపెట్టలేక పోతున్నా రని అన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీఎం జగన్ రాజధానిలో కూర్చొని పరిపాలన సాగించి ఆ ప్రాంతాన్నే నాశనం చేశారని అన్నారు. చక్కటి రాజధానిని పిచ్చి మొక్కలతో దేనికి పనికిరాకుండా మార్చారని తెలిపారు. రాజధాని మార్పు పేరుతో గుంటూరు, కృష్ణా జిల్లాలను సీఎం జగన్ నాశనం చేశారని అన్నారు. నాన్ పొలిటికల్ ఐకాస నేత పి.మల్లిఖార్జునరావు మాట్లాడుతూ సీఎం జగన్ మూడు రాజధానుల ప్రకటనతో అమరావతి రాజధాని ప్రాంతాన్ని అన్నివిధాల దెబ్బతీశారని అన్నారు.



తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని హెచ్‌పిసిఎల్ ఆవరణలో ఉన్న చెత్తకుప్పలో మంటలు చెలరేగాయి. మంటలు ఫ్యాక్టరీ ఆవరణలోకి రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. పెనుప్రమాదం తప్పడంపట్ల అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



20న గ్రూప్-2 పరీక్షపై ఉచిత అవగాహన

ప్రజాశక్తి - తెనాలి

ప్రభుత్వం ప్రకటించిన ఏపీపీఎస్సీ గ్రూప్ 2 పోస్టులకు సంబంధించి ఈనెల 20న సాయంత్రం ఐదు నుంచి ఏడున్నర గంటల వరకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు కె శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక కొత్తపేటలోని ఎన్జీవో హోంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్జీవో కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రూప్ 2 పరీక్షకు సిద్ధపడే విధానంపై అవగాహన కల్పిస్తారన్నారు. పరీక్షకు సంబంధించి సిలబస్, పలు ముఖ్యమైన అంశాలను వివరిస్తారన్నారు. అలాగే సదస్సులో పాల్గొన్న అభ్యర్థులకు 120 పేజీల స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా అందజేస్తారన్నారు. యుటిఎఫ్, జన విజ్ఞాన వేదిక, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సును నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎన్జీవో అసోసియేషన్ నాయకులు బేతాళ కృష్ణమోహన్, పలువురు యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.


సత్తెనపల్లిని కమ్మేసిన పొగ మంచు

మంచు కురిసే వేళలో..

రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

పొగమంచుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్తెనపల్లిని పొగ మంచు కప్పేసింది. మంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కపడక అవస్థలు పడుతున్నారు. లైట్లు వేసుకుని వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. తెల్లవారుజామున ఉష్ణోగ్రతలు 19 డిగ్రీలకు పడిపోవడంతో చలి పంజా విబృభించింది. చలికి ప్రజలు గజగజా వణుకుతున్నారు. చలిగాలులకు ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు అవస్థలు పడుతున్నారు. తెల్ల వారు జామున కురుస్తున్న మంచుతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగు తున్నాయి. అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలుపుతున్నారు.

సమ్మె శిబిరాల్లో లబ్ధిదార్లు, పిల్లలు

అంగన్వాడీలకు సంఘీభావ ప్రకటన, నిరసనలో భాగస్వామ్యం - మద్దతు కూడగడుతున్న కార్యకర్తలు


నాదెండ్ల మండలం గణపవరంలో లబ్ధిదార్లతో మాట్లాడుతున్న అంగన్వాడీలు


తాడికొండ సమ్మె శిబిరంలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని సురేష్ మహల్ రోడ్డులో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరం ఆరో రోజైన ఆదివారమూ కొనసాగింది. అంగన్వాడీ కేంద్రాలకెళ్లే పిల్లల తల్లులు, గర్భిణులు, బాలింతలు సమ్మెకు సంఘీభావంగా శిబిరంలో పాల్గొని మోకాళ్లపై నిరసన తెలిపారు. నాయకులు లక్ష్మీప్రసన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులు గాయత్రి, కమల, బిబి తదితరులు మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలు చాలా బాగా సెంటర్లను నిర్వహిస్తున్నారని, తమ పిల్లల్ని బాగా చూసుకుంటున్నారని అన్నారు. ఇంట్లో ఒక్క పిల్లను భరించటమే కష్టంగా ఉన్న ఈ రోజుల్లో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పదుల సంఖ్యలో పిల్లల్ని ఒక్కదెబ్బ కూడా వేయకుండా చూసుకుంటున్నారని చెప్పారు. మంచి భోజనం పెడుతూ తమ పిల్లల ఆలనాపాలనా బాగా చూసుకుంటున్నారని, అలాంటి వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు. సమ్మె శిబిరాన్ని సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, పట్టణ కార్యదర్శి ఎ.ఆంజనేయులు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు కొండయ్య మాస్టర్ సందర్శించి మద్దతు తెలిపారు. నాయకులు నాగజ్యోతి, డి.బీబులు, శ్రీదేవి, జి.పద్మ, గాయత్రి, నిర్మల, సారమ్మ, మున్ని, ఉమాశంకరి, రేవతి, హారతి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను తీవ్రతరం అవుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని వారు ఆదివారం సందర్శించి మద్దతుగా మాట్లాడారు. అంగన్వాడీల గురించి వైసిపి ఎమ్మెల్యేలు హేళనగా మాట్లాడుతున్నారని, ఇది తగని పనని అన్నారు. రూ.3 లక్షల వేతనాలు తీసుకునే ఎమ్మెల్యేలకు అత్తెసరు జీతాలతో పనిచేసే అంగన్వాడీల సమస్యలు పట్టడం లేదని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని విస్మరించడం దారుణమన్నారు. పేద కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అంగన్వాడీల కార్యకర్తలతో అనేక రకాల పనులు చేపించుకుంటూ వేతనాలు పెంచాలంటే మాత్రం ప్రభుత్వానికి మనసు రావడం లేదని మండిపడ్డారు. మద్దతు తెలిపిన వారిలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు, సిఐటియు నాయకులు జెవి రాఘవులు, రైతు సంఘం నాయకులు డి.వెంకట్ రెడ్డి, ఎం.పకీరయ్య, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ, ఐద్వా నాయకురాలు జి.వీరబాయి ఉన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ

నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలోని సమ్మె శిబిరాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు సందర్శించి మద్దతుగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు తమ సమస్యలపై వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. ఉద్యమాలపై ప్రభుత్వం నిర్బంధాలు విధిస్తోందని, ఇది అప్రజాస్వామిక చర్యని అన్నారు. ఈ నేపథ్యంలో అంగన్వాడీలు మరింత ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉద్యమానికి తమ పార్టీతోపాటు ఎఐటియుసి, సిఐటియు అండ ఉంటుందని



మంగళగిరిలో మద్దతు తెలిపి మాట్లాడుతున్న పాశం రామారావు

చెప్పారు. మద్దతు తెలిపిన వారిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.శివాజీ, సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.భాస్కరరావు ఉన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కుంచనపల్లిలోని అంగన్వాడీ కేంద్రాల తాళాలను అధికారులు పగలగొట్టడానికి వస్తున్నారని తెలిసి అడ్డుకునేందుకు సిపిఎం, టిడిపి, జనసేన నాయకులు కేంద్రాల వద్దకెళ్లారు. అయితే ఎవరూ రాలేదు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీలతో వెట్టిచాకిరి చేయించుకుంటూ కనీస వేతనం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. శాంతియుతంగా సమ్మె చేస్తుండగా మరోవైపు ప్రభుత్వం భయపెట్టేందుకు తాళాలు పగలగొట్టడం సరైన పద్ధతి కాదన్నారు. కేంద్రాలకు అద్దె బకాయిలు చెల్లించకుండా వాటిని అంగన్వాడీలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. టిడిపి మండల అధ్యక్షులు ఎ.సుబ్బారావు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టించడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. అంగన్వాడీలు సమ్మెకు తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.రంగారావు, కె.వెంకటేశ్వరరావు, ఎ.రామారావు, ఎ.సుధాకర్, టిడిపి నాయకులు కె.మహేశ్వరరావు, జనసేన నాయకులు పి.అశోక్, గ్రామ అధ్యక్షులు ఎం.రాజా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతం తుళ్లూరులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని స్థానిక మదర్ థెరిస్సా ఆటో స్టాండ్ వర్కర్స్ యూనియన్ సందర్శించి మద్దతు తెలిపింది. యూనియన్ అధ్యక్షులు జె.నరేంద్ర, పి.నాగమల్లేశ్వరరావు, మరికొంత మంది సమ్మెలో పాల్గొన్నారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు కరిమూన్, సిపిఎం శాఖా కార్యదర్శి పి.బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం మానుకుని సమస్యల పరిష్కరించాలని కోరారు.


తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని కేంద్రాల వద్ద సిపిఎం, టిడిపి, జనసేన నాయకులు



తుళ్లూరులో మద్దతుగా సమ్మె శిబిరంలో కూర్చున్న ఆటో యూనియన్ నాయకులు


కొలకలూరులో తాళాలు పగలగొట్టడాన్ని అడ్డుకుంటున్న టిడిపి, జనసేన


కొల్లిపర

ప్రజాశక్తి - దుగ్గిరాల :తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించే వరకూ సమ్మె కొనసాగుతుందని అంగన్వాడీలు స్పష్టం చేశారు. మండల కేంద్రమైన దుగ్గిరాలలోని సమ్మె శిబిరాన్ని సిఐటియు మండల ఉపాధ్యక్షులు జె.బాలరాజు సందర్శించి మద్దతుగా మాట్లాడారు. సచివాలయ వాలంటీర్ల ద్వారా అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టించడం, భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటే ఈ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పి.జయ, సిహెచ్.నాగమణి, మీనా, వెంకటేశ్వరమ్మ, సునీత, రాజకుమారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

స్థానిక సమ్మె శిబిరంలో అంగన్వాడీలు మోకాళ్లపై నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇతర డిమాండ్లను అంగీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ మండల అధ్యక్షులు జి.నిర్మల జ్యోతి, యు.స్వర్ణలత, కృష్ణవేణి, లక్ష్మి, శివపార్వతి, శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంతోపాటు నియోజకవర్గంలోని పలు అంగన్వాడీ కేంద్రాల పరిధిలో అంగన్వాడీలు లబ్ధిదార్లతో మాట్లాడారు. తమ సమస్యలను వివరించడంతోపాటు సమ్మె నేపథ్యాన్ని వివరించి మద్దతు కూడగట్టారు.

ప్రజాశక్తి - తెనాలి రూరల్

స్థానిక వివిఎస్సార్ కళాశాల ఎదురుగా నిర్వహిస్తున్న సమ్మె శిబిరం కొనసాగింది. కొలకలూరు సమ్మె శిబిరంలో మోకాళ్లపై నిరసన తెలిపారు. అంగన్వాడీ సెంటర్లు తాళాలు పగలుగొట్టేందుకు యత్నించిన ఐసిడిఎస్ అధికారులను టిడిపి, జనసేన నాయకులు అడ్డుకున్నారు. ప్రభుత్వం దిగివచ్చేంతవరకు సెంటర్లను తీయబోమని తలుపులకు అడ్డంగా బైఠాయించారు. సమ్మె శిబిరాల్లో సిఐటియు జిల్లా నాయకులు కె.బాబూప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలకు విరుద్ధంగా పాలన కొనసాగుంతోందన్నారు. 1972లో పార్లమెంటు చేసిన పేమెంట్ ఆఫ్ గ్రాట్యుటి చట్టాన్ని అంగన్వాడీలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వారి ఉద్యోగ పరిస్థితులు మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించుకొని 21నెలలు గడుస్తున్నా సరైన స్పందన లేని నేపథ్యంలో సమ్మె చేపట్టినట్లు వివరించారు. 47వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్లో తీసుకున్న నిర్ణయాలు పదేళ్లయినా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. సమ్మెలో జె.అనురాధ, పి.పావని, పి.విజయలక్ష్మి, ఎ.అంజనికుమారి, జె.రంగపుష్ప, కళాధరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

సమ్మెలో భాగంగా అంగన్వాడీలు తమ కేంద్రాల వద్ద, అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలిపారు. నాయకులు ఉష, శివకుమారి, ఇందిరా, కోటేశ్వరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని పిల్లలు, లబ్ధిదారులు సందర్శించి శిబిరంలో కూర్చుని సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, శివపార్వతి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.


పెదనందిపాడు



మాచర్ల


దుగ్గిరాల







దీక్షలకు ప్రారంభిస్తున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు , రైతు సంఘం రాష్ట్ర నాయకులు జొన్నా శివశంకరరావు, మాజీ వైస్ ఎంపిపి ఎం పకీరయ్య



సమావేశంలో పాల్గొన్న నాయకులు దండా లక్ష్మీనారాయణ తదితరులు

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకపోతే ఉద్యమం ఉధృతం

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

20న ఎంటిఎంసి వద్ద ధర్నా జయప్రదం చేయాలని పిలుపు

ఆందోళనకు సిపిఐ, ఐద్వా, రైతు సంఘం మద్దతు



మద్దతు తెలిపి మాట్లాడుతున్న ఎం రవి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గంలో అనేక సంవత్సరా లుగా పేదలు ఇళ్లు వేసుకుని వివిధ రకాల భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, ప్రభుత్వ స్పందించి ఇవ్వని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. నియోజవర్గంలో ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి రెండో రోజు చేరాయి. రెండో రోజు ప్రారంభ కార్యక్రమానికి సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం రవి అధ్యక్ష వహించారు. దీక్షా శిబిరాన్ని ప్రారంభించి రామారావు మాట్లాడుతూ నియోజకవర్గం లో కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా వేలాదిమంది గత 40 సంవత్సరాల నుండి వివిధ రకాల ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్నప్పటికీ పట్టాలు ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. నివాస ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించారు కానీ, పట్టాలు ఇవ్వడానికి అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని పాలకవర్గాలని విమర్శించారు. మంగళగిరి పట్టణంలో రత్నాల చెరువు, కొండ చుట్టూ ఉన్న ప్రాంతం, పానకాల స్వామి గుడిమెట్ల వద్ద, పావురాల కాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు 6000 మంది ఇల్లు వేసుకొని నివాసం ఉంటున్నారని అన్నారు. ప్రతి ఎన్నికల సందర్భంగా పాలక పార్టీలుగా ఉన్న వైసిపి, టిడిపి, కాంగ్రెస్ పార్టీలో అధికారం కొస్తే పట్టాలు ఇస్తామని హామీ ఇస్తున్నారే గాని ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని విమర్శించారు. వివిధ ప్రాంతాల్లో ఇల్లు తొలగించిన వారికి ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వలేదని అన్నారు. మంగళగిరి నియోజక వర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న ఆళ్ల రామకృష్ణారెడ్డి రాజీనామా చేశారని అన్నారు.



వెంటనే అధికారులు ఈ సమస్యలపై స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 20వ తేదీన ఎంటి ఎం సి కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజల పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదని విమర్శించారు. తాడేపల్లి పట్టణం, రూరల్ గ్రామాల్లో అనేక వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వవలసి ఉందని అన్నారు. పట్టాలు ఇవ్వకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు మాట్లాడుతూ అభ్యంతరం ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వం అనేక జీవోలను తీసుకువచ్చి సౌకర్యాలు కల్పించడం జరిగిందని అన్నారు. పాలక పార్టీలు తలుచు కుంటే చెరువులను, కొండ ప్రాంతంలో ఉన్న భూములను వారి ఇష్టానుసారం ఇస్తుందని అన్నారు. పేదల కు ఇళ్ల పట్టాలు ఇవ్వాలంటే మాత్రం అభ్యంతరాలు ఉన్నాయని మాత్రం చెప్పుకోస్తున్నారని విమర్శించారు. ఇళ్ల పట్టాల సమస్యపై సిపిఎం ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనకు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరపతయ్య రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఇళ్ల పట్టాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీన జరిగే ధర్నా కార్యక్రమాన్ని కూడా మద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు. ఐద్వా గుంటూరు జిల్లా కార్యదర్శి ఎల్ అరుణ మాట్లాడుతూ ఇళ్ల పట్టాల కోసం సిపిఎం చేస్తున్న పోరాటానికి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నందం బ్రహ్మేశ్వర రావు, సిన్ని సత్యనారాయణ, ఏ ప్రభాకర్, బి శ్రీనివాసరావు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ప్రారంభోత్సవ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కాట్రగడ్డ శివరామ కృష్ణయ్య, ఎం పకీరయ్య , దొంతి రెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం మంగళగిరి పట్టణ నాయకులు వివి జవహర్లాల్, కే శ్రీనివాసరావు, కే వెంకటేశ్వర్లు, ఈ కాటమరాజు, టి హేమ సుందర రావు తదితరులు ప్రసంగించారు. దీక్ష శిబిరంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ నాయకులు డి రామారావు, ఎం చలపతిరావు, టి శ్రీరాములు, జె శివ భవన్నారాయణ, ఎం రాంబాబు, ఎం చంద్ర, ఎస్ కోటేశ్వరరావు, ఎం బాలాజీ, చంద్రమౌళి, ఆదినారాయణ, కే శివ కుమారి, జి వీరాబాయి, ఎస్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం చేయకే ఎముకల సమస్యలు



మాట్లాడుతున్న డాక్టర్ రవితేజ

ప్రజాశక్తి-గుంటూరు

వ్యాయామం లేకపోవడం వల్ల దీర్ఘకాలంలో ఎముకలు, కీళ్ల సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని ప్రముఖ అర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ యార్లగడ్డ రవితేజ అన్నారు. అవగాహన సంస్థ ఆదివారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ రవితేజ మాట్లాడుతూ టి.వి.సాయిరామ్ సమన్వయర్తగా వ్యవహరించిన సభలో డాక్టర్ రవితేజ మాట్లాడుతూ వ్యాయామం, సైక్లింగ్, స్విమ్మింగ్ లాంటి మార్గాలు అనుసరిస్తే చాలావరకు కీళ్లు, ఎముకలకు సంబంధించిన సమస్యలు రావని తెలిపారు. పెద్దలలో ఎముకల అరుగుదల, ఎముకలు మెత్తబడటం సమస్యలు వస్తాయన్నారు. ఎముకలలో ఆరుగుదల జన్యాపరంగా , దొడ్డి కాళ్లు వలన, జీవనశైలి వలన కలుగుతుందని, వీటిలో జీవనశైలి కారణంగా వచ్చే అరుగుదలను మంచి ఆహారం తీసుకుంటూ, బరువును అదుపులో ఉంచుకొని, వ్యాయామం చేస్తూ నియంత్రణచేయవచ్చు అని తెలిపారు. అదే ఎముకలు మెత్తబడటం అనేది విటమిన్-డి లోపం వల్ల సంభవిస్తుందని చెప్పారు. ముఖ్యంగా స్త్రీలకు నెలసరి ఆగిన స్త్రీలకు ఈ సమస్య ఎక్కువగా ఉంటుందన్నారు. నడక, వెయిట్ లిఫ్టింగ్, ఎండలోఉండటం ద్వారా ఈ సమస్యను నియంత్రించొచ్చన్నారు. మోకాళ్లలో గుజ్జు పట్టడానికి వాడే మందులు తొలి దశలో ఉన్నపుడు ఉపయోగమని, బాగా ముదిరిన సందర్భంలో అంతగా ఆ మందులు ఉపయోగపడవని తెలిపారు. మోకాళ్ల నొప్పులకు కొన్ని సందర్భాల్లో ఇంజక్షన్ల ద్వారా, అలాగే స్టెమ్సెల్ థెరపీ ద్వారా కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉందన్నారు.ఇక మోకాళ్ల ఆపరేషన్‌లు చివరి దశలో చేస్తారని, ఆపరేషన్ తర్వాత ఫిజియోథెరపి చాలా ముఖ్యమని, నిర్లక్ష్యం చేస్తే ఆపరేషన్ ఫలితాలన్ని పూర్తిగా పొందలేమన్నారు. వ్యాయామం, ఆహార అలవాట్లు ద్వారా ఎముకలు అరగటం, మొత్తబడటం నియంత్రించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వేమన ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, అవగాహన సంస్థ అధ్యక్షులు కొండా శివ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్ల మధ్య ఘర్షణ సృష్టించొద్దు

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్‌వాడీల సమ్మెకు వెలుగు యానిమేటర్ల ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ మద్దతు తెలిపారు. ఆదివారం స్థానిక పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన సంఘ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కె.దెబొర, కార్యదర్శి విజయలక్ష్మి, గౌరవ అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి యానిమేటర్లను, స్కీం వర్కర్లను పావులుగా వాడుకోవడాన్ని మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించటం చేతగాని రాష్ట్ర ప్రభుత్వం స్కీం వర్కర్ల మధ్య ఘర్షణ వాతావరణాన్ని సష్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. యానిమేటర్లు రోజువారి చేయాల్సిన పనులతోనే ఇబ్బంది పడుతుంటే అదనపు పనులతో వారిని ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. యానిమేటర్లు ఇతర స్కీం వర్కర్లు ప్రభుత్వ అణిచివేత విధానాల్ని వ్యతిరేకించి, తోటి స్కీం వర్కర్లైన అంగనవాడీలకు మద్దతు తెలుపుతున్నట్లు సంఘం నాయకులు స్పష్టం చేశారు. అన్ని మండల కేంద్రాల్లో యానిమేటర్లు అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలపాలని యానిమేటర్లకు విజ్ఞప్తి చేశారు. గత పది నెలలుగా అంగన్వాడీ సెంటర్స్ అద్దె చెల్లించకుండా, వండిన భోజనాలకు బిల్లులు చెల్లించకుండా, ఈవెంట్స్‌కు డబ్బులు ఇవ్వకుండా, జీతాలు చెల్లించకుండా అణిచివేత ధోరణి వల్లే ఈరోజు అంగన్వాడీలు సమ్మెకు దిగాల్సిన పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని అన్నారు. ఈ విధానాలు మానుకోకపోతే గత ప్రభుత్వాలకు పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పట్టిందని హెచ్చరించారు.



ఎఎన్‌యు వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపియస్ కళాశాలలో ఆదివారం ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అంతర కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు ప్రారంభం అయ్యాయి. వర్సిటీ పరిధిలోని వివిధ కాలేజిల నుండి 25 జట్లు పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏ.బి.పి.మనోహర్ తెలిపారు. కష్ణ వేణి డిగ్రీ కళాశాల (నరసరావుపేట) ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలపై 2-0 సెట్స్‌తో, ఆర్‌విఆర్ ఇంజినీర్ కాలేజి, జెకెసి కాలేజి జట్టుపై 2-1 సెట్స్‌తో, ఏపి ఆర్‌డిసి (నాగార్జున సాగర్) ఆంధ్ర క్రైస్తవ కళాశాలపై 2-0 సెట్స్‌తో, ఏఎన్‌యు ఇంజినీరింగ్ కాలేజి టిజెపిఎస్ జట్టుపై 2-0 సెట్స్‌తో, హిందూ కళాశాల, సిద్దార్థ కళాశాలపై 2-1 సెట్స్‌తో, బాపట్ల కళాశాల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కె.బి.ఆర్. కళాశాలపై 2-0 సెట్స్‌తో, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలపై 2-1 సెట్స్‌తో, ధనలక్ష్మి కళాశాల (ముప్పాళ్ల) యమ్.ఏ.యమ్. ఫామసీ కళాశాలపై 2-1 సెట్స్‌తో, టి.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల (కందుకూరు), బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలపై 1-2సెట్స్‌తో గెలుపొందాయి.కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కె.వి.బ్రహ్మం, ట్రెజరర్ వి. కష్ణానంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివాజీ, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.శ్రీనివాసరావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వాలీ బాల్ సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్. పి. గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఆడితే కొత్త ఉత్తేజం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడితే కొత్త ఉత్తేజం నింపుతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. నరసరావుపేటలోని ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల ప్రాంగణంలోని ఈత కొలనులో పల్నాడు జిల్లా స్విమ్మింగ్ పూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న 9వ సబ్ జూనియర్ , జూని యర్ స్విమ్మింగ్ పోటీలలో 18 జిల్లాల నుంచి పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చాటిన చిన్నా రులకు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం.శ్రీనివాసరావు, జడ్పిటిసి పి.చిట్టిబాబు, మాజీ జడ్పిటిసి జి.శ్రీనివాసరావు వైసిపి నాయకులు కె. ఎజ్రా పాల్గొన్నారు.



స్విమ్మింగ్ లోప్రతిభ చాటిన చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే, ఎంపిపి,జడ్పిటిసి తదితరులు

ఎఎన్‌యు జుడో పోటీలకు 'ధనలక్ష్మి' విద్యార్థి

ప్రజాశక్తి-ఈపూరు



పి.నాగ వెంకటేశ్వర్లు

ఈ నెల 15న ఎఎన్ యులో జరిగిన అంతర్ కళాశాలల జుడో పోటీలలో 90 కేజీల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎ ఎన్ యు జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు ఆదివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ మేదం మెట్ల రామ శేషగిరిరావు, అధ్యాపకులు ఆర్ బలరాం నాయక్, సిహెచ్ అరవింద్, దాసు అభి నందించారు.

టెన్నిస్ పోటీల్లో నరసరావుపేట చిన్నారుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గుంటూరులోని ఎన్టీఆర్ గార్డెన్స్ లో గ్లోబల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలలో నరసరావుపేట పట్టణానికి చెందిన చిన్నారులు విన్నర్స్ గా నిలిచారని కోచ్ బుక్యా బాబు నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అండర్ -14 విభాగంలో వీరవల్లి పూజ, అండర్ -10 ,అండర్ -12 విభాగంలో పివి సూక్తి తమ ప్రతిభ చాటి విన్నర్స్ గా నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పూజా, సూక్తిలను ప్రత్యేకంగా అభినందించారు. పట్టణంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ని ఆఫీసర్స్



అవార్డులు, ప్రశంసా పత్రాలతో టెన్నిస్ క్రీడాకారిణులు పూజ, సూక్తి



చిన్నారి సూక్తిని అభినందిస్తున్న కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు వాసిరెడ్డి జయరామయ్య

రక్తదానానికి యువతను ప్రోత్సహించండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 51వ పుట్టినరోజును పురస్కరించుకొని నియోజకవర్గ స్థాయిలో రెడ్‌క్రాస్ వైసిపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మెగా రక్త దాన శిబిరాన్ని విజయవంతం చేయాలని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో నాలుగు మండలాల నాయకులతో మాట్లాడారు. గత ఏడాది 836 మంది రక్తదానం చేయగా ఈ ఏడాది వెయ్యిమంది రక్తదానం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఇందు కోసం యువత ముందుకు వచ్చేలా వారిలో చైతన్యం కల్గించాలని చెప్పారు. ఒక్క వ్యక్తి ఇచ్చే రక్తదానంతో ముగ్గురు ప్రాణాలు కాపాడవచ్చనే విషయాన్ని యువతకు చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో నాయ కులు పక్కాల సూరిబాబు, మర్రి సుబ్బారెడ్డి, చంద్ర మౌళి, ఆర్.పురుషోత్తం, నక్క శ్రీను, ఏంజెఆర్ లింగారెడ్డి, ఎస్.గోపాలరావు, ఆర్ వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్ సాయిరెడ్డి, ఎఎంసి చైర్మన్ అంజిరెడ్డి, ఎ.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

ఆర్ఆర్ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాలలో రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-నరసరావుపేట

తమ హాస్పిటల్స్ స్థాపించి 8వ సంవత్సరలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్ఆర్ సూపర్ స్పెషాలిటీ దంత వైద్య శాల అధినేత డాక్టర్ చింతగుంట అజయ్ కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినుకొండ రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని తమ హాస్పిటల్ స్థాపించిన అనతి కాలంలోనే విరిగిన దవడ శస్త్ర చికిత్సలు విజయవంతంగా ప్రతి ష్టాత్మకంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఉచిత దంత వైద్య శిబిరంలో పిప్పి దంతాలు, కదులుతున్న దంతాలు ఉచితంగా తొలగిస్తామని ఇతర దంత వైద్య సేవలు రాయితీపై అందిస్తామన్నారు. దంత సమ స్యలతో బాధపడే వారు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య శ్రీ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, జర్నలిస్టులకు ఉచితంగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. డెంటల్ ఇంప్లాంట్స్ ద్వారా శాశ్వత కృత్రిమ దంతాలు, రూట్ కెనాల్, ఎత్తు వంకర పళ్ళు సరి చేయడం వంటి చికిత్సలు పల్నాడు జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరలలో నాణ్యమైన

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని రఘురాంనగర్ లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ , టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు, మాజీ ఐఎఎస్ జె.సుందర్ శేఖర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మానుకొండ శివప్రసాద్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సభకు టిడిపి నియోజకవర్గ ఉపాధ్యక్షులు దారా ముసలయ్య అద్యక్షత వహించారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా పాస్టర్లకు నూతన వస్త్రాలు బహుకరించారు. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ కుమార్ టిడిపి నాయకులు నాగోతు శౌరయ్య , అంకాళ్ళ ప్రభుదాస్ మాజీ మున్సిపల్ చైర్మన్ యెలినేడి రామస్వామి పాల్గొన్నారు.



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

బుచ్చిబాబు మెమోరియల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-నరసరావుపేట

పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులోని జిల్లా క్రీడా ప్రాంగణంలో ఆదివారం బుచ్చిబాబు మెమోరియల్ బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నమెంట్ పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా కారులను పరిచయం చేసుకుని వారితో మాట్లాడారు. వారితో బ్యాడ్మిటన్ ఆడి ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్ష,కార్యదర్శులుగా జగ్గయ్య, నాగిరెడ్డి నియామకం

ప్రజాశక్తి-రొంపిచర్ల



మండల టిడిపి అధ్యక్షుడిగా రొంపిచర్లకు చెందిన పులుకూరి జగ్గయ్య, ప్రధాన కార్య దర్శిగా అన్నవరప్పాడు గ్రామానికి చెందిన పల్లెల నాగిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నరసరావుపేట నియోజక వర్గ టిడిపి కార్యాలయం నుండి ఆదివారం ప్రకటన జారీ చేశారు. నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ డాక్టరు చదలవాడ అరవిందబాబు ఆదేశాల మేరకు వారిని నియమించినట్లు టిడిపి నాయకులు తెలిపారు. మండల టిడిపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన జగ్గయ్య, నాగిరెడ్డి లను పలువురు టిడిపి నాయకులు అభినందించారు. తమ నియామకానికి సహకరించిన వారికి వారు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో టిడిపి ని బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని జగ్గయ్య, నాగిరెడ్డి తెలిపారు.



'యూత్ జో డో బూత్ జోడో'లో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ నాయకులు

ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్‌కు డిమాండ్

ప్రజాశక్తి- పెదకూరపాడు

ఉద్యోగ నియామకాలకు వైసిపి ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంట గోపి అన్నారు. ఆదివారం పెదకూరపాడు మండలంలోని 75 తాళ్లూరులో 'యూత్ జో డో బూత్ జోడో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ఎలక్షన్లకు ముందు జాబ్ క్యాలెండర్ అంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పి గద్దెనెక్కిన వైఎస్ జగన్ నిరుద్యోగులను నిండా ముంచారని విమర్శించారు. గ్రూప్ వన్,గ్రూప్ టు నోట టిఫికేషన్ కి సంబంధించి వయో పరిమితిని 42 ఏళ్ల నుండి 44 ఏళ్లకు పెంచాలని, వెంటనే మెగా డీఎస్సీ ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరుద్యోగుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు శివాజీ, తిరుపతిరావు, గోపి, వినయ్, వెంకట్ పాల్గొన్నారు.



కొమెరపూడి కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, గ్రామస్తులు

250 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్వర్గీయ కోయనాగయ్య జ్ఞాపకార్థం పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ హారికా, డాక్టర్ మెహబూబ్ లు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అవసరమైనవారికి కళ్ళజోళ్ళు అందచేశారు. సుమారు 250 మందికి కంటి పరీక్షలు చేశారు. 135 మందికి శుక్లాలు వున్నట్లు గుర్తించి ఆపరేషన్ కోసం శంకర్ కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో కోయ కష్ణ, సుబ్బారావు, పాండురంగారావు, హనుమంతరావు, యర్రా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోశాధికారిగా జాన్‌బాబు

ప్రజాశక్తి-పెదకూరపాడు



మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోశాధికారిగా పెదకూరపాడు గ్రామానికి చెందిన కంచర్ల జాన్ బాబు ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జిల్లా కోశాధికారిగా కంచర్ల జాన్ బాబు, పెదకూరపాడు నియోజకవర్గ ఎంఎస్పి అధ్యక్షుడుగా వేమవరపు జీవన్ ను నియమించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాన్ బాబును గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు అభినందించారు.

ధాన్యం ధరలు పెరిగినా .. దిగుబడి తగ్గింది

- తుపానుకు ముందు ఎకరాకు 42-45 బస్తాలు దిగుబడి
- ప్రస్తుతం 30-35 బస్తాలకు తగ్గిన పరిస్థితి
- తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి విక్రయిస్తున్న రైతులు

ప్రజాశక్తి-దుగ్గిరాల

తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు ధాన్యం ధరలు ఆశాజనంగా మారాయి కానీ, అనూహ్యంగా దిగుబడి తగ్గింది. గతవారం 77 కేజీల బస్తా రూ. 1,650 రూపాయలు కాగా, ప్రస్తుతం రూ. 1,900 నుండి రూ.2,000 కు నిల్వ దారులు కొనుగోలు చేస్తున్నారు. మరోపక్క ఎగుమతి దారులు కొనుగోలు డిమాండ్ లేదని, నిల్వదారులు ధరలు పెంచి కొను గోలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ధాన్యం తడిసి దిగుబడి తగ్గే అవకాశం ఉందని, అందువల్ల రాబోయే రోజుల్లో ధరలు పెరిగే అవకాశం ఉన్నందున నిల్వదారులు ధరలు పెంచి కొనుగోలు చేస్తున్నారని చెబు తున్నారు. తడిసిన ధాన్యం కూడా రూ.50 నుండి రూ.100కు తగ్గించి కొనుగోలు చేస్తుండటంతో, రైతులు ముమ్మరంగా నూర్పిళ్ల చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి అమ్మేస్తున్నారు. ధాన్యం ధరలు రూ.2,200 నుండి రూ.2,500 వరకు త్వర లోనే పెరుగుతాయనే అభిప్రాయాలు వినపడుతున్నాయి.



దిగుబడిపై ప్రతికూల ప్రభావం

ధరలు పెరిగాయని రైతులు సం తోషించే పరిస్థితి లేదు. తుపాను ముందు ఎకరాకు 42 నుండి 45 బస్తాలు దిగుబడి ఉండగా ప్రస్తుతం 30 నుండి 35 బస్తాలకు తగ్గిందని రైతులు వాపో తున్నారు. ఇంకా నూర్పిళ్ల చేయ కుండా ఉంటే 25 నుండి 30 బస్తాల వరకు దిగు బడి తగ్గ వచ్చని ఆందోళన చెందు తున్నారు. చేలలో నీరు ఇంకా నిలువ ఉండటం, వాహ నాలు వెళ్లేదారులు పడకపోవడం వలన నూర్పిళ్ల ఆలస్యం అవుతున్నాయి. రహదారి పక్కన వాహనాలు వెళ్లే మార్గం ఉన్న చేలలో మాత్రం ముమ్మ రంగా నూర్పిళ్ల జరుగు తున్నాయి. తుపాను కారణంగా పడ పోయిన చేలలో గింజ తడిసి రాలిపోవడం వలన దిగుబడి తగ్గటానికి ప్రధాన కారణమని రైతులు చెబుతున్నారు. ధరలు పెరిగినప్పటికీ దిగుబడి తగ్గడంతో ఒరిగిందేమీ లేదని రైతులు చెబుతున్నారు.



తుళ్లూరు రైతు దీక్షా శిబిరం వద్ద మానవహారంగా రైతులు ,మహిళలు

రాజధాని రైతుల ప్రదర్శన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని రైతులు ఆదివారం రాత్రి కొవ్వొత్తులు చేతబట్టి గ్రామంలో ప్రదర్శన జరిపారు.ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటన చేసి 4 ఏళ్ల యిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రదర్శన నిర్వహిం చారు. అనంతరం రైతు దీక్షాశిబిరం వద్ద మానవహారంగా ఏర్పడ్డారు.బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినదించారు.

సుచరితకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - తాడికొండ



ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత ఆదివారం తాడి కొండలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరాన్ని సందర్శించారు. సమన్వవయ్యకర్తగా తొలిసారి తాడికొండ రావడంతో గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలతో ముచ్చటించారు అనంతరం స్థానిక అడ్డరోడ్డు సెంటర్లో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె వెంట మేకతోటి దయాసాగర్, పార్టీ మండల అధ్యక్షులు బి.వెంకటేశ్వర రెడ్డి జడ్పిటిసి గుడిమెట్ల జ్యోతి పార్టీ నాయకులు టి.నరసింహారావు , డి.నాగేశ్వరరావు,యు.నరసింహారావు, షేక్ జానీ పాల్గొన్నారు

విద్య పరమార్థాన్ని గుర్తించాలి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గ్లోబలీకరణ నేపథ్యంలో ఉన్నతంగా రాణించేందుకు విద్య ఒక సాధనం మాత్ర మేనని, జీవన నైపుణ్యాలు కష్టించే మన స్తత్వం మాత్రమే యువతను వారు అనుకున్న రంగాలలో ఉన్నత స్థానాలలో నిలబెడతాయని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అరండల్‌పేట కమ్మ హాస్టల్ శత జయంతోత్సవాలలో భాగంగా విద్యార్థులకు 'రోల్ ఆఫ్ కమ్యూనిటీ హాస్టల్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' అంశంపై స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే విద్య ప్రాధాన్యత గుర్తించి వసతి గృహాన్ని ఏర్పాటు చేసి ఉచిత వసతి కల్పించి దేశ విదేశాలలో వైద్యులుగా, ఇంజనీర్లుగా, విద్యావంతులుగా, తీర్చిదిద్ది వారిని ఉన్నత స్థానాలలో నిలబెట్టిన కమ్మ హాస్టల్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో హాస్టల్ కార్యదర్శి మందలపు బంగారుబాబు, డాక్టర్ యర్ర నాగేశ్వరరావు, డాక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరరావు, హాస్టల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరయ్య సేవా ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - మంగళగిరి



మాట్లాడుతున్న ఎమ్మెల్సి మురుగుడు హనుమంతరావు

స్థానిక చిల్లపల్లి అమరయ్య సేవా ట్రస్ట్ సహకారంతో విజయవాడ టాప్ స్టార్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మంగళగిరి వీవర్స్ కాలనీ ఎంటిఎంసి హైస్కూల్‌లో ఆదివారం ఉచిత పూర్తి స్థాయి గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతి థులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంజి చిరంజీవి హాజ రయ్యారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సి ప్రారంభించారు. ఎత్తు, బరువు, పల్స్, టెంపరేచర్, బిపి, షుగర్, ఇసిజి, ఎకోతో పాటు గుండెకు సంబంధించిన అన్ని పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సంజయ్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ట్రస్ట్ చైర్మన్ చిల్లపల్లి నాగ తిరుమల రావు అధ్యక్షత వహించారు. ఈ సంద ర్భంగా మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ట్రస్ట్ చైర్మన్ నాగ తిరుమలరావు పేదల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహనరెడ్డి కొత్తగా ఆరోగ్యశ్రీ ద్వారా ట్రీట్‌మెంట్‌కు రూ.25 లక్షల వరకు పెంచారన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సిహెచ్ శ్రీనివాసరావు, విజయవాడ దుర్గ గుడి ప్రత్యేక ఆహ్వాన కమిటీ సభ్యులు జె.ప్రభాకరరెడ్డి, ప్రముఖులు ఎస్.పుల్లా రావు, జె.శివప్రసాద్, హైస్కూల్ హెచ్ఎం జి.నాగేశ్వ రరావు, ట్రస్ట్ ప్రతినిధులు బి.సామ్రాజ్యం, జొన్నాదుల సత్యవతి, నగేష్, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పేద విద్యార్థులకు 'కెపా' మెరిట్ స్కాలర్‌షిప్పులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న పేద విద్యార్థులకు అండగా నిలవాల్సిన బాధ్యత సమా జంలో పతిఒక్కరిపైన ఉందని తులసీ సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు అన్నారు. కృష్ణ దేవరాయ ఎడ్యు కేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ (కెపా) 19వ మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణి కార్యక్రమం స్థానిక టీజీకే కళ్యాణమండపంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ సమాజాన్ని అభివృద్ధి పరచాల్సిన బాధ్యత యువత భుజస్కంధాలపై ఉందని, విద్యార్థుల భవిష్యత్తుతోనే దేశాభివృద్ధి ఆధార పడిందని అన్నారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి రంగిశెట్టి మంగబాబు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాలు ఏర్పరుచుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. కెపా అసోసియేషన్ ద్వార గత 19 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు మెరిట్ ఉపకార వేతనాలు అందిస్తున్నారని అన్నారు. సహృదయంతో ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్న దాతలవల్లే ఇది సాధ్యమైనట్లు చెప్పారు. ప్రియదర్శిని విద్యాసంస్థల అధినేత చందు రామారావు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఎదిగి సమాజం పట్ల తమవంతు బాధ్యతగా సేవ చేయాలన్నారు. అసోసియేషన్ ద్వారా ఆర్థిక సహాయం పొంది స్థిరపడిన తమ కళాశాలల పూర్వ విద్యార్థులు తిరిగి అసోసియేషన్ కు చేయూత నందించడం హర్షనీయమన్నారు.ప్రముఖ వ్యాపారవేత్త అరవ రామకృష్ణ మాట్లాడుతూ చదువులో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు సమాజం చేయూతనివ్వాలని కోరారు. కెపా అధ్యక్షులు, విశ్రాంత ప్రధానోపాధ్యా యులు బొల్లిముంత వెంకట నారాయణ మాట్లాడుతూ 2002 సంవత్సరంలో 20 వేల రూపాయలతో ప్రారంభించి ఈ సంవత్సరంలో ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, పీజీ చదువుతున్న 358 మంది మెరిట్ విద్యార్థులకు రూ.11,18,680 ఉపకార వేత నంగా అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో ముందుగా కెపా సెక్రటరీ తాడికొండ చిన్నబ్బాయి వార్షిక నివేదిక సమర్పించారు. తకార్యక్రమంలో వివిధ అమెరికా ప్రోగ్రెస్సివ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చందు శ్రీనివాసరావు, విశ్రాంత కస్టమ్స్ అసిస్టంట్ కమిషనర్ బళ్ళ నరేంద్ర కుమార్, తెనాలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు, ఆంధ్రప్రదేశ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బడే ప్రభాకర్, నారాయణ విద్యాసంస్థల ఏజీఎంకే వెంకటేశ్వరరావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.



స్కాలర్‌షిప్ అందిస్తున్న తులసి దాస్ ప్రభు



భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఏటుకూరి వెంకటేశ్వరరావు మృతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాజధానిలోని నవులూరులో నివసిస్తున్న ఏటుకూరి వెంకటేశ్వరరావు (61) ఆదివారం మృతి చెందారు. వెంక టేశ్వరరావు భౌతికకాయానికి సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, జొన్న శివశంకరరావు, సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, సిపిఎం తాడేపల్లి మండల రూరల్ కార్యదర్శి డి.వెంకటరెడ్డి, సిపిఎం మంగళగిరి మండల నాయకులు ఎం.పకీరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మాట్లాడుతున్న నాయకులు జంపని హనుమంతరావు

దళితులకు రుణాలు మంజూరు చేయట్లేదు

ప్రజాశక్తి-పెదనందిపాడు

మండలంలోని అన్నారంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'ఓ దళితుడా మేలుకో' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం దళితులకు కార్పొరేషన్ రుణాలు మంజూరు చేసి, వారి అభివృద్ధికి ఎంతో తోడ్పడిందని తెలిపారు, ప్రస్తుత ప్రభుత్వంలో కార్పొరేషన్ల తప్ప లోన్లు మంజూరు చేయడం లేదన్నారు, ఈ కార్యక్రమంలో ఎన్నారై టిడిపి ఆళ్ల వెంకట్, పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులు జంపని హనుమంతరావు, నాయకులు రావి శివరామ కృష్ణయ్య, దివ్వి నాగరాజు,ఎమ్ చెంచయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు భాగ్యరావు, గ్రామ అధ్యక్షులు నంగినేని రోశయ్య, రైతు విభాగ రాష్ట్ర నాయకులు అగస్టీన్, క్లస్టర్ బొల్లా శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సుభాష్‌పత్రి సంస్మరణ సభ

ప్రజాశక్తి-తాడేపల్లి

ఫిరమిడ్ సొసైటీ ఫర్ స్పిరిటుల్ అధినేత సుభాస్ పత్రి సంస్మరణ సభ ఆదివారం తాడేపల్లి సుందరయ్యనగర్‌లోని మానస సరోవరం ఫిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పత్రిజీ సేవలను గుర్తుచేసుకొని నివాళులు అర్పించారు. ధ్యానం ద్వారా మంచి సమాజం వస్తుందని అభిలాషించారు. ప్రజల్లో తలె త్తుతున్న అసహనం పట్ల జాగురుకతతో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ వయోలిన్ విద్యాంసులు ఎ. రామ స్వామిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ పెర్ఫారింగ్ ఆర్ట్స్ డీన్ డాక్టర్ జి. అనిత్, విశ్వభారతీ కూచిపూడి ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకులు ఎం.కాశీ విశ్వనాధ్, ఆశ్రమ నిర్వాహకులు కల్లం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్నాడు జిల్లా జగనన్నకు చెబుదాం రద్దు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి 2 విడత జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లాలో సోమవారం నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

శస్త్ర చికిత్సలో నూతన ఆవిష్కరణలపై సదస్సు

ప్రజాశక్తి - తెనాలి


అతిథులను సత్కరిస్తున్న ఐఎంఎ బృందరం

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, గైనకాలజీలో నూతన శస్త్ర చికిత్స విధా నాలపై అవగాహన సద స్సును ఆదివారం నిర్వ హించారు. స్థానిక బోసు రోడ్డు లోని ఐఎంఎ కార్యాలయంలో ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో ట్రోఫికల్ ఫీవర్ అంశంపై డాక్టర్ జె పూర్ణచంద్రరావు మాట్లాడారు. చలికాలానికి తోడు అప్పుడప్పుడు పడుతున్న వర్షాలు కారణంగా వ్యాప్తి చెందే జ్వరాలు, వాటి నివారణ, చికిత్స విధానాలను వివరించారు. గైనకాలజీ విభాగంలో నూతన శస్త్ర చికిత్స విధానాలపై డాక్టర్ అశ్విని మాట్లాడారు. వైద్యరంగంలో రోజురోజుకు అత్యాధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుందని, తద్వారా శస్త్ర చికిత్సలలో కూడా మెరుగైన విధానాలు అవలంబిస్తున్నట్లు చెప్పారు. ఇవి వైద్యరంగంలో స్వాగతించదగ్గ పరిణామాలన్నారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలపై ప్రతి నెల అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ పావని ప్రియాంక మాట్లాడుతూ వైద్యరంగంలో రోజురోజుకు చోటు చేసుకుంటున్న కొత్త విధానాలను అవలంబించడంలో వైద్యులు నిత్య విద్యార్థులేనన్నారు. ఈ సందర్భంగా ఐఎంఎ తరపున వక్తలను సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ దక్షిణామూర్తి, డాక్టర్ అబ్బయ్య, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ విశ్వమోహనరావు, డాక్టర్ కోటి నాగయ్య, డాక్టర్ ఎం వి సత్యనారాయణ, పాల్గొన్నారు.

బాపు రమణ బాలు కళాపీఠం ఆధ్వర్యంలో పురస్కారాలు


పురస్కారం అందుకుంటున్న అనిల్ రావిపూడి

ప్రజాశక్తి-గుంటూరు :గీతలతో భాషను బ్రతికించిన గీతాచా ర్యులు బాపు అని వక్తలు కొని యాడారు. స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో బాపు రమణ బాలు కళాపీఠం ఆధ్వర్యంలో పద్మశ్రీ బాపు జయంతి సభ, పురస్కా రాల ప్రధానం కార్యక్రమం జరిగిం ది. ఈ సభలో వక్తలు మాట్లా డుతూ తన ప్రతిభతో తెలుగువారి గొప్పదనాన్ని విశ్వవ్యాప్తం చేసిన దర్శకుడు చిత్రకారుడు, కార్టూనిస్టు పద్మశ్రీ బాపు అని అన్నారు. డాక్టర్ రమణ యశస్వి అధ్యక్షత వహించిన ఈ సభలో అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యులు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు సాహితి సమాఖ్య అధ్యక్షులు ఎస్‌విఎస్ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ ఎన్.వి.కష్ణారావు, ప్రముఖ పారిశ్రామికవేత్త కోటిరావు ప్రసంగించారు.ఈ సభలో బాపు స్మారక పురస్కారాలు అందజేశారు.సుప్రసిద్ధ సినీ దర్శకులు అనిల్ రావిపూడి సుప్రీం దర్శకేసరి పురస్కారాన్ని అందుకున్నారు. చిత్రకారులు పి.చిదంబరం గ్రామ శాస్త్రి ప్రసిద్ధ కార్టూనిస్టు బొమ్మన్‌లు బాపు స్మారక పురస్కారాలను అందుకున్నారు. కార్యక్రమంలో బాపు రమణ బాలు కళాపీఠం కార్యదర్శి ప్రొఫెసర్ సుశీలమ్మ, నవ మల్లెతీగ పత్రిక సంపాదకులు కలిమిశ్రీ పాల్గొన్నారు.

క్లుప్తత, గాఢత నారాయణబాబు కవిత్వ ప్రత్యేకత

ప్రజాశక్తి-గుంటూరు :క్లుప్తత, గాఢత శ్రీరంగం నారాయణబాబు కవిత్వ ప్రత్యేకత అని ప్రముఖ సాహితీవేత్త యర్రగుంట్ల పాణిరావు అన్నారు. అమరావతి సాహితీ మిత్రులు ఆదివారం స్థానిక బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాహిత్య కార్యక్రమంలో ఆయన శ్రీరంగం నారాయణబాబు రచించిన 'రుధిర జ్యోతి' కవిత్వ సంపుటి గురించి ప్రసంగించారు. సంప్రదాయ శిఖరాలపై ఆధునిక కవితా పతాకాన్ని ఎగుం ేవేసినవాడు నారాయణబాబు అన్నారు. 'రుధిర జ్యోతి' చదవడం, ఆధునిక తెలుగు కవిత్వం తొలి అడుగులను తెలుసుకోవడం అవసరం అన్నారు. నారాయణబాబు కవితల్లో మార్క్సిజం, సామాజిక వాస్తవికత, నిత్య జీవన పోరాటం, మానవుని దీనస్థితి, దాన్ని గెలవాలన్న తపన కనిపిస్తాయని సోదాహరణంగా విశ్లేషించారు. విదేశీ ప్రక్రియ అయిన సర్రియలిజం అనుసరించి రచనలు చేశారనీ, దేశీయ సంస్కృతిని, పౌరాణిక గాథలని, సంస్కృత శబ్దాలను ప్రభావంతంగా ఉపయోగించారని, కాల్పనికతను విమర్శిస్తూ వాస్తవికతకు ప్రాధాన్యం ఇచ్చారని వివరించారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించిన సభలో మైలవరపు రామశేషు, డాక్టర్ ఉయ్యూరు లక్ష్మి నరసింహారావు మొదలైన వారు ప్రముఖ చలనచిత్ర నటీమణి సూర్యకాంతం నటనా వైదుష్యం గురించి ప్రసంగించారు. ఈ మాసం కవిగా లీలా కృష్ణ (తెనాలి) పాల్గొని అనేక కవితల్ని వినిపించారు. లీలా కృష్ణను, నిక్కచ్చి కవిత' గా ఎంపికైన కవి గోలి హనుమ చ్ఛాస్త్రిని ఈ సందర్భంగా పింగళి భాగ్యలక్ష్మి, రంగారావు, పాణి రావు, డాక్టర్ ఉయ్యూరు లక్ష్మీ నరసింహా రావు, డాక్టర్ టి సేవ కుమార్ సత్కరించారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవితా పఠన కార్యక్రమంలో పలువురు కవులు కవితలు వినిపించారు.


కవి లీలా కృష్ణను సత్కరిస్తున్న రావి రంగారావు, పాణిరావు తదితరులు

రేపటి నుంచి సచివాలయాల్లో జాబితాలు

- పంట నష్టంపై రైతుల వివరాలతో ప్రదర్శన
- 22 వరకు సోషల్ ఆడిట్‌కు అవకాశం
- 26న ప్రభుత్వానికి తుదినివేదిక

ప్రజాశక్తి ప్రతినిధితో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు





మిచౌంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న పంటల వివరాలపై ఎన్యూమరేషన్ సోమవారంతో పూర్తవుతుందని మంగళవారం నుంచి అన్ని సచివాలయాల్లో జాబితాలను అందుబాటులో ఉంచుతామని వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. సోషల్ ఆడిట్ నిమిత్తం సచివాలయాల్లో జాబితాలు ఈనెల 22 వరకు ఉంచి తుది నివేదికను ఈనెల 26న ప్రభుత్వానికి పంపుతామని ఆయన వివరించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

తుపాను వల్ల పంట నష్టం వివరాలు?

తుపాను వల్ల కేవలం ఒక్క రోజులోనే అతి భారం వర్షం వల్ల పంటలు నీటమునిగాయి. ఆ తరువాత వర్షాలు లేకపోవడం వల్ల చాలా ముంపు సమస్య తగ్గింది. మునిగిన పంటల వివరాలను సేకరిస్తున్నాం. పొలాల్లో ఎన్యుమరేషన్ చురుగ్గా జరుగుతుంది. జిల్లాలో తుపాను వల్ల వరి 1.05 లక్షల ఎకరాల్లో వరి, 25 వేల ఎకరాల్లో మిర్చి, 21 వేల ఎకరాల్లో శనగ, 7300 ఎకరాలు మినుము, 2500 ఎకరాల్లో పత్తి, మరో 10 వేల ఎకరాల్లో ఇతర పంటలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా అంచనా వేశాం. 33 శాతం కన్నా ఎక్కువగా దెబ్బతిన్న పంటలను మాత్రమే గుర్తిస్తున్నాం. పూర్తి వివరాలు త్వరలో వస్తాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖల సిబ్బంది గ్రామాల వారీగా పంట నష్టం నమోదును చేపట్టారు.

పంట నష్టపరిహారం ఎంత ఇస్తారు?

వరి, పత్తి, మిర్చికి హెక్టారుకు రూ.17 వేలు ఇస్తారు. మొక్కజొన్నకు రూ.12,500, పొగాకుకు రూ.10వేలు, అరటికి రూ.25 వేలు ఇస్తారు. శనగ పంట ప్రాథమిక దశలోనే దెబ్బతినడం వల్ల పరిహారం రాదు. 80 శాతం సబ్సిడీతో శనగ సాగు దార్లకు విత్తనాలను అందిస్తాం. ఇందుకోసం 10 వేల మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని ప్రభుత్వానికి నివేదిక పంపాం.

రబీలో ఏయే పంటలు సాగుకు అవకాశం ఉంది?

జలాశయాల్లో నీటి నిల్వలు లేకపోవడం వల్ల అపరాల సాగు తప్ప మిగతా పంటలు సాగు చేయరాదు. కేవలం మినుము, పెసర మాత్రమే వేయాలని రైతులకు సూచిస్తున్నాం. డెల్టాలోని పలు మండలాల్లో రైతులు ఎక్కువగా జొన్న,మొక్కజొన్న సాగు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చింది. జొన్న, మొక్కజొన్న వద్దని చెబుతున్నాం. ఈనెలలో తుపాను వల్ల ఒక్కరోజులోనే అధిక వర్షం కురిసింది. మళ్లీ వర్షం లేదు. కాల్వలకు నీరు వచ్చే అవకాశం లేనందున మినుము సాగు చేసుకోవాలని సూచిస్తున్నాం. మినుము ధరలు కూడా ఆశాజనకంగా ఉన్నాయి.

ఈ ఏడాది పత్తి దిగుబడులు ఎలా ఉన్నాయి?

జిల్లాలో పత్తి సాగు చేసిన ప్రాంతాల్లో అధిక వర్షాల వల్ల స్వల్ప నష్టమే జరిగింది. మెట్ట ప్రాంతం కావడం, నీరు త్వరగానే బయటకు పోవడం వల్ల పత్తికి పెద్దగా నష్టం లేదు. ఇప్పటికే ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గరిష్ఠంగా 15 క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చునని అంచనా.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చరిత్రను విస్మరిస్తే మనుగడ ప్రశ్నార్థకమే

ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ ప్రెసిడెంట్ సోమశేఖరరావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సోమశేఖరరావు, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

వర్తమాన, భావితరాలకు తమ గత చరిత్రలను అధ్యయనం చేసే అవకాశం పాలకులు కల్పించకపోతే ఆ జాతుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ ఎలెక్ట్ ప్రెసిడెంట్ మాజేటి సోమశేఖర రావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో గుంటూరు జిల్లా చరిత్ర సంఘం 29వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. చరిత్ర కాంగ్రెస్ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో ముఖ్య వక్తగా పాల్గొన్న సోమశేఖరరావు మాట్లాడుతూ గత చరిత్రలోని దుర్మార్గాలను, మంచి చెడులను అధ్యయనం చేసుకుంటూ భవిష్యత్ తరాలకు నాగరిక జీవన విధానానికి తీసుకు వెళ్ళేది చరిత్ర మాత్రమేనని తెలియజేశారు. అధ్యక్షత వహించిన గుంటూరు జిల్లా చరిత్ర సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ ఎన్.శామ్యూల్ మాట్లాడుతూ ఇజ్రాయిల్, పాలస్తీనా వివాదం పరిష్కారానికి గతంలో ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని అంతర్జాతీయ సమాజం ఒత్తిడి తీసుకొచ్చి అమలు చేయటం ఒక్కటే మార్గమని తెలియజేశారు. అందుకు భారతదేశం చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా ఆచార్య బుడ్డిగా జమిందార్ వ్యాసాల సంకలనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంతెన వెంకటరాజు స్మారకంగా 'విద్యా వ్యవస్థలో చరిత్ర- మార్పులు, వ్యాఖ్యానాలు' అంశంపై చరిత్ర సమీక్షకులు కొప్పర్తి వెంకటరమణమూర్తి మాట్లాడగా సభకు వై సుభాష్ చంద్రబోస్ అధ్యక్షత వహించారు. 'భారత రాజ్యాంగం-లౌకికవాదం' అంశంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.అంజిరెడ్డి ఉపన్యసించగా సభకు సయ్యద్ అమీర్ అధ్యక్షత వహించారు.కార్యక్రమంలో సంఘం కార్యదర్శి డాక్టర్ మంచాల బోసుబాబు, డాక్టర్ పోతురాజు శ్రీనివాసరావు, సి.ఎస్.ఆర్. ప్రసాద్, పలువురు చరిత్ర అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ సంతకాల సేకరణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి



ప్రజల నుండి సంతకాలు సేకరిస్తున్న నాయకులు

సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో కోట్ల ప్రజాధనంతో నిర్మించిన క్రీడా ప్రాంగణం అనేక సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉందని, ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ పల్నాడు జిల్లా కమిటీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో స్టేషన్ రోడ్డు లోని స్టేడియం ఆవరణలో ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు మాట్లాడుతూ సత్తెనపల్లిలో వావిలాల స్టేడియం ప్రారంభం చేయపోవడం వలన క్రీడా ప్రాంగణంలో అనేక ఆసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా ఉంటుందని, కోట్లాది రూపాయలతో నిర్మించిన భవనం, మరియు మైదానం పాడవుతుందన్నారు. ఆటాడుదాం ఆంధ్ర అని చాలా ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం ప్రారంభించిన ఆటలు సరిగ్గా జరగాలంటే ఈ సందర్భంగా ఆ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించినట్లయితే సులువుగా ఆడదాం ఆంధ్ర కార్యక్రమాన్ని పూర్తి చేయొచ్చు అని ఆయన హితవు పలికారు. ప్రభుత్వం ఏ ఇతర కారణాలవల్ల క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించలేదో ఎవరికి అర్థం అవడం లేదన్నారు. క్రీడా ప్రాంగణాన్ని వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. తక్షణం క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించకుంటే తామే యువకులతో కలసి ప్రాంగణాన్ని ప్రారంభిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జడ రాజకుమార్, ఇట్లాస్ తదితరులు పాల్గొన్నారు.